

# శ్రీసన్నిధానం

సంక్రాంతి శుభాకాంక్షలు

15 జనవరి 2022



ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. వైభవంగా శ్రీసన్నిధానం ఆవిష్కరణ

5. శ్రీరామానుజమార్గంలో జీవించాలి

6. రామానుజ సుధామాధురి

7. నవసంఖ్య రహస్య సారం

8. శ్రేష్ఠమైన గోదాకళ్యాణం

9. ఋత్విక్ సమీకరణ -హోమ శిక్షణ

10. అదిగో అల్లదిగో సమతామూర్తి

11. భయంలేని జీవితం గడిపే మార్గం

12. ఆకాశం నుండి అమృత బిందువులు



సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

గౌరవ సంపాదకులు

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

శుభసంక్రాంతి ప్రతి ఇంటా ఆనందపు పరవళ్ళు ధాన్యలక్ష్మి ఇంట చేరిన వేళ... గోదామ్మవారి వ్రతమాచరించిన వేళ... ప్రతి ఇంటా వేడుక. హేమంతంలో ధనుర్మాస ఉషఃకాలాన శ్రీరంగనాధుని అర్చించి శ్రియఃపతిని వలచి వరించి పరిణయమాడిన గోదాదేవి మనకు ఆరాధ్యం. శ్రీవైష్ణవ క్షేత్రాలలో, తిరుమాళిగలలో గోదాదేవి "గోపికావ్రతం" సాక్షాత్తు భగవంతుని సాక్షాత్కారానికి నిదర్శనం. సస్యశ్యామలం చేసేది పుష్యమాసం. పాతాళానికి తొక్కబడిన బలిచక్రవర్తి ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారా? అని చూడటానికి సంక్రాంతినాడు భూమిమీదకు వస్తాడని ఒక నమ్మకంతో ఇంటి ముందు ముగ్గులు వేయడం ఆచారం. సూర్యభగవానుడు రథం ఎక్కిఉత్తర దిక్కుపయనం అవుతున్నాడన్న సంకేతాన్ని తెలియజెప్పడానికి ముగ్గులరథాలు వేయటం సంప్రదాయం. ధాన్యరాశులు, చెఱకురసాలు, బంతిపూలు, రేగుపళ్లు లభించేసమయం ఇదే. గంగిరెద్దుల మేళాలు, గోపూజలు, బొమ్మల కొలువులు, బొంగరాల ఆటలు, గగనతలాన గాలిపటాలు ఒక్కటేమిటీ ఆయా ప్రాంతాలవారీగా ఆటలు పుట్టుకవచ్చాయి. ధనుర్మాసానికి వీడ్కోలుగా, పుష్యమాసానికి స్వాగతంగా చేసే పండుగ ఈ సంక్రాంతి. ఎన్నో ఎన్నెన్నో సంగతులను ఆవిష్కరించిన చిత్రం శ్రీమాన్ డింగరి సంపత్ కుమార్ కుంచనుంచి జాలువారింది.


PUBLISHED BY :

డింగరి శ్రీనివాసమూర్తి

మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9 502583323;








# వైభవంగా 'శ్రీసన్నిధానం' ఆవిష్కరణ

'శ్రీసన్నిధానం' ఆధ్యాత్మిక పత్రిక ఆవిష్కరణ మహోత్సవం 29 డిసెంబర్ 2021 వైభవంగా భాగ్యనగరంలో పర్వతాపూర్‌లో జరిగింది. ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ కండ్లకుంట్ల వెంకట నరసింహాచార్యులు వారు పత్రికను ఆవిష్కరించి సంపాదక మండలికి ప్రతులను అందజేశారు. మేనేజింగ్ ఎడిటర్ శ్రీమాన్ డింగరి శ్రీనివాసమూర్తి పత్రికా ప్రతిని తన మాతృమూర్తి శ్రీమతి డింగరి రమాదేవి గారికి అందజేసారు. శ్రీనివాసమూర్తి తండ్రిగారు పత్రికా సంపాదకులు, శ్రీమాన్ డింగరి లక్ష్మీ నారాయణాచార్యులు, శ్రీమతి రమాదేవి గార్లు ఆశీస్సులు అందజేశారు. ఆవిష్కరణ సభకు విచ్చేసిన బంధువులు, ఆత్మీయులు కరతాళ ధ్వనులతో తమ హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశారు.



దీప ప్రజ్వలన




మాతృ వందనం

తొలుత దీపప్రజ్వలన అనంతరం విశిష్ట అతిథి శ్రీమాన్ కండ్లకుంట్ల వెంకట నరసింహాచార్యులు గారిని, అతిధులను శ్రీనివాసమూర్తి సత్కరించారు.

పత్రిక ఆవిష్కరణ అనంతరం ఉభయ వేదాంతపండితులు శ్రీమాన్ కండ్లకుంట్ల వెంకట నరసింహాచార్యులు వారు మాట్లాడుతూ "శ్రీసన్నిధానం పత్రిక" కూడా తను జీవిస్తూ ఎదిగి ముందుకురావాలి అని వారు మంగళాశాసనాలు అనుగ్రహించారు. ప్రజల హృదయాలలో శ్రీసన్నిధానం కావాలి అని శ్రీమాన్ కండ్లకుంట్ల వెంకట నరసింహాచార్యులు వారు తమ ప్రవచనంలో పత్రిక నిర్వాహకులకు మంగళాశాసనాలు అనుగ్రహించారు. "శ్రీసన్నిధానం" పత్రిక పేరులోనే విశిష్టత ఉందని అంటూ., శ్రీ అనగా లక్ష్మీదేవి. పరమాత్మను తాను ఆశ్రయించి, మనలను ఆశ్రయింప చేస్తుందని శ్రీమాన్ వెంకట నరసింహాచార్యులు వారు ఉద్బోధించారు. స్వామి ప్రేమగా లక్ష్మీదేవిని వక్షస్థలంలో పెట్టుకొన్నాడు. నా వలననే స్వామిని మీరూ ఆశ్రయించండి, అప్పుడు నావలెనే మీకు వైభవం కలుగుతుందన్నది అమ్మ సందేశం అని వారు అన్నారు. అమ్మ మనకు ఇచ్చే సందేశం ఏమిటి అంటే పరమాత్మను ఆశ్రయించండి మీరూ బాగుపడండి. మీరు నన్ను ఆశ్రయిస్తారు, నేను ఆయనవద్దకు చేరుస్తాను. అందుకే ముందు లక్ష్మీ అష్టోత్తరం, ఆ తరువాత విష్ణు సహస్ర నామావళి అనుసంధానం చేసుకోవాలి. అని శరణాగతి గద్యలో భగవద్



రామానుజులవారు చెప్పారు. మీరందరూ పుట్టటానికి కావలసిన బీజం వేసినవాణ్ణి నేను నన్నే ఆశ్రయించండి అని భగంవతుడు కూడా భగవద్గీతలో చెప్పాడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని చెప్పినట్లు నన్ను ఆశ్రయించండి. అన్నాడు.


వెబ్ పేజీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పిల్లవాని అభివృద్ధి కోసం తల్లి తండ్రులు ఎలా తాపత్రయ పడతారో తనను ఆశ్రయించిన వారికోసం పరమాత్మ అంత తాపత్రయపడతాడు. మనం బాగు పడాలి అని అనుకొంటాడు. మనం ఈ ఆధునిక వ్యవహారంలో పడిపోయి సంప్రదాయ జ్ఞానం లేనివాళ్ళ మవుతున్నాం కనుక మళ్ళీ దాన్ని వృద్ధి చేయడంలో, మనకు జ్ఞానాన్ని కలిగించి ముందుకు నడిపించడంలో "శ్రీసన్నిధానం" అందరికి ఉపయోగపడేలా వుండాలి అని అంతర్జాల పత్రికను వెల లేకుండా ఉచితంగా ఇస్తున్నారు. వారి ఆశయంలో సంపూర్ణ విజయం సాధించాలని పెరుమాళ్ళ సన్నిధిలో విజ్ఞాపన చేస్తున్నాను అని తమ అమూల్య సందేశాన్ని శ్రీమాన్ వెంకట నరసింహాచార్యులు వారు అందించారు.

శ్రీసన్నిధానం పత్రిక ఆవిష్కరణ అనంతరం శ్రీసన్నిధానం వెబ్ పేజీని మార్కెటింగ్ ఎడిటర్ శ్రీ సముద్రాల రఘురామాచార్య వారు ఆవిష్కరించారు. పత్రిక సంపాదకులు శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణా చార్యుల వారు తమ మంగళాశాసనాలను తెలియజేస్తూ పత్రిక పురోభివృద్ధి జరిగేలా సంపాదక మండలి కృషిచేయాలని వారు ఉద్భోధించారు.

పత్రిక చీఫ్ ఎడిటర్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి, వొపీనియన్ ఎడిటర్ శ్రీమతి సముద్రాల శారద, మార్కెటింగ్ ఎడిటర్ శ్రీ సముద్రాల రఘురామాచార్య పత్రిక విధివిధానాలను వివరించారు. అనంతరం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ విశ్రాంత ఉద్యోగి, చీఫ్ ఎకౌంటంట్ శ్రీమాన్ సముద్రాల గోపాలమూర్తి, ప్రముఖ విమర్శకులు, విశ్లేషకులు శ్రీ డింగరి రమణాచార్యులు, తెలంగాణా విద్యుత్ బోర్డులో విశిష్టసేవలు అందిస్తున్న శ్రీ చిలుకమర్రి రఘు ఆచార్యులు, శ్రీనేరళ్ల శ్రీరంగాచార్య, శ్రీమతి పద్మ, శ్రీమతి వొద్దిపర్తి రాజ్యశ్రీ తదితరులు తమ సందేశాలను అందించారు.

మేనేజింగ్ ఎడిటర్ శ్రీ డింగరి శ్రీనివాసమూర్తి ప్రసంగిస్తూ పత్రిక విధి విధానాలను, పత్రిక రూపొందడానికి చేసిన కృషిని వివరించారు. భాగవతోత్తముల అమూల్య సలహాలను స్వీకరిస్తూ పాఠకుల అభిరుచిమేరకు సరళంగా అందించడానికి కృషిచేస్తామని, సంప్రదాయ పరిరక్షకు పత్రికతోడ్పడుతుందని వెల్లడించారు. చివర శ్రీడింగరి నర్సింహమూర్తి పత్రిక ఆవిష్కరణ సమావేశానికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, భాగవతోత్తములకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.


ఆవిష్కరణ మహోత్సవంలో ప్రసంగిస్తున్న వక్తలు

# శ్రీరామానుజ మార్గంలో జీవించాలి

“తిరుప్పావై, శ్రీభాష్యం ప్రవచనాలతో శ్రీ ఉ. వే. శ్రీమాన్ శ్రీ కండ్లకుంట్ల వేంకట నర్సింహా చార్యులు నిర్వాహకులకు పరిచయం. ఈ పరిచయంతోనే వారిని శ్రీ సన్నిధానం పత్రిక ఆవిష్కరణ మహెూత్సవానికి విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. శ్రీ సన్నిధానం పత్రికా నిర్వహకుల విజ్ఞాపనను మన్నించి. శ్రీ ఉ. వే. శ్రీమాన్ శ్రీ కండ్లకుంట్ల వేంకట నర్సింహా చార్యులు విచ్చేసిన సందర్భంలో చేసిన వారి ప్రసంగ పాఠం వారి ప్రవచనం శ్రీరామానుజ భావాలను ప్రతింబింబిచేలా సాగింది. వారు అందించిన మంగళాశాసన పూర్వక సందేశాన్ని యధాతథంగా అందిస్తున్నాము.



“తిరుప్పావై, శ్రీభాష్యం ప్రవచనాలతో మీ అందరూ పరిచయం అయ్యారు. అందరూ భగవద్ రామానుజుల వారి భగవద్విషయం, శ్రీభాష్యం అనుసంధించుకోండి అని శ్రీ రామానుజుల వారు చివరి సందేశం ఇచ్చారు. అందరూ అనుసరించండి'' అని ప్రసంగిస్తూ. అనేక సంప్రదాయ విశేషాలను ఈవిధంగా వివరించారు. పరమాత్మను, అంతర్యామిని గుర్తుంచుకొని, నారాయణున్ని శరణు వేడేదే ప్రపత్తి, అదే భగవద్ రామానుజులు చెప్పింది .పరమాత్మ దయగలిగినవాడు, తన పుత్రులు ఏడుస్తూ వుంటే ఎంత కఠినుడైనా ఒకనాటికి కరుణకలిగినవాడవుతాడు అన్యధా శరణం నాస్తి ! త్వమేవ శరణం మమ ! తస్మాత్ కారుణ్య భావేన రక్ష రక్ష జనార్ధన !, నువ్వు తప్ప వేరే దిక్కులేదు అంటే పరమాత్మ మనల్ని బయటపడవేస్తాడు . ఆ తత్వం తెలిసేది శ్రీభాష్యం వలన దానివల్ల కలిగే ప్రయోజనము, కళ్యాణగుణాలు చెప్పేది భగవద్విషయము అంటే దివ్యప్రబంధం. వాటిని అనుసంధానం చేయండి.

ముందు కాలంలో పెరుమాళ్ళ ఆరాధన చేయకుండా బతకలేక పోయేవారు. ఆ విధంగా సమర్పణ బుద్ధి వుండేది . మనకోసం చేయటంకాదు, భగవదారాధనలో సమర్పించిన దాన్నే తీసుకొన్నవాళ్ళు వాడు చేసిన పాపములన్నిటి నుంచి విముక్తి పొందినవాడు అవుతాడు. నేను నా కోసం బ్రతకటం లేదు, నీకోసమే, నీవు తినగా మిగిలిన శేషాన్ని స్వీకరిస్తున్నా అనే భావనతో సమస్తం కైంకర్య రూపంలో సమర్పించుకున్నవాళ్ళు భగవదనుగ్రహానికి పాత్రులవుతారు. అలాంటి సాధువులను కాపాడటానికే పరమాత్మ'' సంభవామి యుగే యుగే “అని తాను అవతరిస్తాడు., ఆయన పుట్టటానికి కారణం ఏమీ లేదు. అవసరమూ లేదు. కానీ అనేకసార్లు జన్మిస్తాడు. వివిధ రూపాల్లో పుడతాడు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన ఇలా ఎన్నో రూపాల్లో జన్మిస్తాడు. మనకోసం ఆ రూపాలు ధరించి, ఉపకారం చేస్తాడు. అటువంటి దయా మయుడైనటువంటి కళ్యాణ గుణాకరుడైన పరమాత్మను మనం సేవించుకోవాలి. ఆచార్యుల వద్ద సమాశ్రయణం కావాలి. స్వామి స్వరూపాన్ని తెలుసుకోవాలి. స్వామిని ఉపాసించగలిగే పద్ధతులు, మంత్రం, దాని అర్థం తెలుసుకొని, ఆచార్యుడు చూపించిన మార్గంలో పెరుమాళ్ళకు కైంకర్యం చేసుకోవాలి. ప్రతి మనిషిలో పరమాత్మను దర్శించుకోవాలి. మనం తినబోయే పదార్థాన్ని ఇతరులకు కొంచెం పెట్టి తాను తిని వారిలో వుండే పరమాత్మను సంతోషపరచాలి. అప్పుడే పరమాత్మ అనుగ్రహం లభిస్తుంది. చెట్టు మొదట్లో నీళ్ళు పోస్తేనే అది చిగురించి ఆకులు కాయలు కాస్తుంది. అట్లాగే మన ఎదురుగా వుండే సర్వ భూతములలో, ప్రాణులయందు దయకలిగి, భగవదర్పణ తో ఎవరైతే జీవనం గడుపుతారో వారు కచ్చితంగా పరమాత్మ అనుగ్రహాన్ని పొందుతాడు.

మనం ఈనాటి కాలంలో అటువంటి వాతావరణాన్ని, మన ప్రాచీన సంస్కారాన్ని, సంస్కృతిని మరచిపోతున్నాము ప్రశాంతమైన జీవితం గడుపుతూ, భగవద్ రామానుజులవారు చెప్పినట్టు ఎవ్వరిని ద్వేషించకుండా అవసరానికి తగినట్లుగా బాగుపడటం కోసం జీవించాలి. ఇతరులకు చేయూతనివ్వాలి.

మనకు జ్ఞానాన్ని కలిగించి ముందుకు నడిపించడంలో “శ్రీసన్నిధానం''అందరికి ఉపయోగపడేలా వుండాలి అని శ్రీ ఉ. వే. శ్రీమాన్ శ్రీ కండ్లకుంట్ల వేంకట నర్సింహా చార్యులు తమ ప్రసంగ ప్రవచనంలో పత్రిక అందిస్తున్న విధానానికి అన్వయిస్తూ ఎన్నో అమూల్య విషయాలను అందించారు.

# కలిమి నిచ్చే కల్పతరువు

కలిమి లేములు జంటపదాలు జీవిత అనుభవాలు. కలిమి అంటే సంపద. కడగండ్ల నుంచి మనను కడదేర్చగలిగేదే నిజమైన కలిమి. సకల దుఃఖాలనుంచి మనను ఉపశమింపజేసేది భగవదనుగ్రహం అనే కలిమి మాత్రమే! అదే ఒక గొప్ప ఆస్తిక భావన. అటువంటి సంపదను ప్రతి ఒక్కరికి లభింప చేయడానికి తానై అవతరించిన వారు జగదాచార్యులు. మనను ఉజ్జీవింప చేసే ఆచరణ విధిని, సాంప్రదాయ నిధిని మనకు అందించారు. అంతులేని వేద వాఙ్మయ సారాన్ని అందుకోగలిగే ఔషధ గుళికలా అందించారు. విభువయిన జగత్కారణ తత్త్వాన్ని సులభంగా ఆరాధించే మార్గాన్ని సూచించారు. భగవంతుణ్ణి పొందగలిగే యోగ్యత అందరికీ ఉంటుందని తెలియపరిచారు. అందుకే వారు జగదాచార్యులయినారు. భగవద్ రామానుజాచార్యులు ఉదయించి సహస్రాబ్ది దాటే వరకు వారి కీర్తి, దయా స్ఫూర్తి సహస్ర ముఖాలుగా విస్తరించింది. వారి సూక్తి సుధ సర్వత్రా ప్రసరిస్తున్నది. ఆ సాంప్రదాయ ధార మనకు కలిమి నిచ్చే కల్పతరువు. శతాధిక సంవత్సరకాలం వారు తిరుమేనితో సంచరిస్తూ, అతి సామాన్యుల వరకూ అందరూ ఉద్ధరింపబడడానికే కృషి చేశారు. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా కొంచెం కఠినంగా ఉండే ఆచారాలను లోకహితం కోసం సంస్కరించారు. అనుష్ఠానాలను సుగమం చేశారు. తాను మంత్రోపదేశం పొందడానికి ఆచార్యుల వద్దకు సహనంతో 18సార్లు తిరిగి వారి మనసును కరిగించి ఉపదేశం పొందారు. మరి ఇంకెవరూ అలా కష్టపడకుండా ఉండేవిధంగా ఎంతోమంది ఆచార్యులను తయారుచేసి తర్వాతి తరాల వారికి అనుగ్రహించారు. తమ ఆచార్యులను కూడా ఔదార్యగుణంతో మెప్పించారు. శ్రీ రామానుజాచార్యులకు ఉపదేశం చేసిన ఐదుగురు ఆచార్యులు కూడా మొదట సందేహించి తర్వాత వారి లోకోపకారబుద్ధికి ఆశ్చర్యచకితులయినారు. తమ కుమారులను వారికి శిష్యులుగా సమర్పించుకున్నారు. పాషాణ హృదయాలను కూడా ద్రవీభూతం చేసిన ప్రతిభాపాటవాలు గలవారు జగదాచార్యులు. వేదాగమశాస్త్రాలను, భగవద్గీతను, రామాయణ భారత ఇతిహాసాలను, క్షుణ్ణంగా తన మేధస్సుతో మథించారు. అవి దేశ కాల కుల మత నియంత్రణ భేదాలు లేకుండా లోకహితాన్ని కలిగిస్తాయని నిరూపించారు. సకల మానవాళికి ఉజ్జీవనాన్ని కలిగించే మన వైదిక సంస్కృతిని ప్రకాశవంతం చేశారు. విశిష్టాద్వైత సిద్ధాంతం అంటే వేదార్థం బోధించే ఒక శాఖగా కాకుండా, లోకోపకారకమైన ఒక జీవన విధానంగా ఏర్పరచి ఆసంప్రదాయాన్ని మనకందించారు.




భగవంతుడంటే కళ్యాణ గుణశీలుడైన జగత్కారకుడు. పరస్పర సహకారంతో బ్రతికే విధిని సూచించే గుణం కలవాడు జీవుడు. సదా మనం కాపాడుకో గల ఆవశ్యకత కలిగినది ప్రకృతి . చిత్ అచిత్ ఈశ్వర తత్త్వాన్ని నిరూపించే సిద్ధాంతాన్ని ప్రబోధించారు. అంటే సమస్తము భగవత్ శరీరంగా గుర్తించి ప్రకృతి చేతనుడు కూడా పరమాత్మ శరీరమని శరీర శరీరి సంబంధాన్ని నిరూపించారు. అందుకే శ్రీరామానుజ సిద్ధాంతం వసుదైక కుటుంబం అనే భావన కలిగినది. బ్రహ్మసూత్రాలకు వీరు అనుగ్రహించిన శ్రీభాష్యం, గీతాభాష్యం, మరియు వీరు ప్రవచించిన శ్రీసూక్తులు దేశ,కాల, వర్గ భేదాలు లేక శుభాలను చేకూర్చేవని కీర్తించబడుతున్నాయి. సమాజానికి సర్వహితాలను గూర్చి సంక్షేమాన్ని ప్రసాదించే సంస్కృతి క్షేత్రాలు దేవాలయాలు. కష్టం వచ్చినా, విపత్తు కలిగినా మనోధైర్యాన్ని ఐక్యత స్ఫూర్తిని ప్రసాదించేవి దేవాలయాలు. విద్య వివేకం ధార్మిక ఆచరణ దైవ అనుగ్రహం అన్నీ లభించే స్థానం దేవాలయం మాత్రమే. అటువంటి దేవాలయ వ్యవస్థను జగదాచార్యులు పటిష్ఠపరిచారు. భగవత్ శక్తి తేజరిల్లే విధంగా ఆరాధనా విధివిధానాలను ఆగమోక్తంగా సంస్కరించారు.'' వైదిక సంస్కృతి గల జీవన విధానం సమ సమాజ జీవన గతికి విఘాతం కాదు " అని నిరూపించిన సమతామూర్తి శ్రీ భగవద్ రామానుజాచార్యలవారు. అందుకే

**"పుణ్యాంభోజ వికాసాయ పాప ధ్వాన్త క్షయాయ చ**
**శ్రీమానా విరభూద్భూమౌ రామానుజ దివాకరః"** (పుణ్యమనే పద్మాన్ని వికసింప చేయటానికి, పాపం అనే చీకట్లను పోగొట్టడానికి శ్రీమద్ రామానుజాచార్యులు అను సూర్యుడు ఈ భూమిపైన ఉదయించాడు) అని లోకహితైషుల చేత స్తుతింపబడ్డారు. అందుకే లోక కళ్యాణానికై దివ్య సాకేతమందు ఆచరించ తలపెట్టిన వైదిక క్రతువు ఆస్తికుల సేవలతో సంపన్నవంతమవుతుంది.అపర రామానుజులు శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి కరకమలములచేత ఆవిష్కరింపబడు సమతామూర్తి విరాట్ స్వరూపం సమాజ శ్రేయస్సుకు కృషి చేసే స్ఫూర్తిని అందరిలో కలిగిస్తుంది. ★

# నవ సంఖ్య రహస్యం సారం

తొమ్మిది మానవాళి మనుగడకు శ్రేయోదాయకం. ఆవిష్కరణకు సిద్ధం అవుతున్న సమతామూర్తి క్షేత్రంలో ఎన్నో విశిష్టతలు - మరెన్నో రహస్యాలు దాగి ఉన్నాయి. ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే మనకు దివ్య అనుభూతి కలుగుతుంది. ఈ అనుభూతి కలగడానికి తొమ్మిది అంకెతో ముడివడిన సంఖా శాస్త్రం దాగి ఉంది. మానవాళికి మేలుచేసేవిధం మన జగదాచార్యులు శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఆలోచించి వ్యూహరచన చేశారు. చాలా కాలంగా సమతా మూర్తి ఆవిష్కరణ ఎప్పుడెప్పుడు అని ఆలోచించే వారు తరచూ ఆమూర్తిని సందర్శించడానికి ముచ్చింతల వెళ్ళిన సందర్భాలు ఉన్నాయి. అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించిన వారు కూడా ఉన్నారు.

ప్రతియేటా విదేశాలనుంచి తమ బంధువులను చూడవచ్చేవారు సమతామూర్తిని సందర్శించి ఆచార్యుల దర్శించి వారి చిరునవ్వుల మంగళాశాసనాలు స్వీకరిస్తూ వెళు తున్నారు. ఇది ఇలా ఉంటే ఆవిష్కరణ తేదీ ప్రకటించిన నాటానుండి నిర్మాణ విషయాలు విశేషాలు తెలుసుకోవాలన్న ఆతృత ప్రతి ఒక్కరిలో పెరుగుతొంది.

ఆచార్యులు చెబితేనే వినాలి... అలాగే భగవత్ రామానుజాచార్య స్వామి సహస్రాబ్ది వేడుకలు, సమారోహ ఉత్సవాల గురించి శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి వారు తమ ప్రవచనాలో ప్రస్తావించారు. మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు ఫిబ్రవరి 2 వ తేది నుంచి 14 వ తేది వరకు ఈ సమారోహ ఉత్సవాలను జరుపుతున్నారు. విశేషించి ఈ క్షేత్రం చాలా గొప్పది. రామానుజులవారు వేంచేసిన ఈ సమతామూర్తి క్షేత్రం స్టాచ్యు ఆఫ్ ఈక్వాలిటీ అని మనం ఆంగ్లంలో పిలుచుకొంటాం. క్షేత్రంలో ఒక అద్భుతమైన విశేషం వుంది. మొత్తం అంతా ఎక్కడ చూసినా తొమ్మిది సంఖ్యతోనే ముడిపడి వుంటుంది. తొమ్మిదికి సంఖ్యా శాస్త్ర ప్రకారం అవికారి అని పేరు. ఏ వికారాలు పొందనిది. అందుకే అటువంటి తొమ్మిదికి నవమి పూట శ్రీరామ చంద్రుడు జన్మించాడు. నవమి తిథిన రాముడుగా జన్మించి వికారం అనేది మనిషికు కలగకూడదు అనేది మనకి నిరూపించారు. వికారాలు కలిగించకుండా చేసే ఈ క్షేత్రం తొమ్మిదితో సంబంధం వుంది. భగవంతునికు నవవిధ సంబంధాలు వున్నాయి. ఆ భగవంతుడు మనకి తండ్రి, రక్షకుడు అందరు సేవలు స్వీకరించే శేషి అని నవవిధసంబంధాలు చెప్పుకోవచ్చు. అలాంటి క్షేత్రం తొమ్మిదితో సంబంధం ఎలా అయిందో తెలుసుకొందాం. సమాతామూర్తి 216 అడుగులు. న్యూమరాలజీ విషయానికి వస్తే 216 అంటే(2+1+6=9) 9 సంఖ్య వస్తుంది. శ్రీరామానుజులవారు వేంచేసిన పీఠం భద్రవేది. ఇది 54 అడుగులు, 5+4=9. దాని పైన వున్నది పద్మపీఠం. అది 27 అడుగులు అంటే 2+7= 9. పద్మపీఠంలో 36 ఏనుగులు వున్నాయి. 3+6 =9. దానిలో వున్న పద్మంలో మూడు వరసలు పద్మ దళాలు వున్నాయి. ఒక్కొక్క వరుసలో 18 దళాలు వుటాయి. దానిలో చిన్న ఉపదళం ఉంటుంది. అవి 18, ఇవి 18 తో వరుసకు 36 వుంటాయి. అలా మూడు వరసలు 36 ను 3 తో గుణిస్తే 108 అంటే 9 సంఖ్య. ఇక పద్మపీఠం వెడల్పు 108 అడుగులు. రామానుజుల వారు దగ్గర శ్రీ శఠారి 18 అడుగులు. పద్దెనిమిది అంటే 9. శ్రీరామానుజుల వారి మూర్తి 108 అడుగులు. రామానుజుల వారు త్రిదండం 144 అడుగుల పొడవు. అంటే 4+4+1 =9. అలా రామానుజుల వారి త్రిదండం బరువు చూస్తే 54 టన్నులు అంటే 54 వేల కేజీలు. రామానుజుల నేత్రాలలో ఒక నేత్రం నాలుగున్నర అడుగులు మరొకటి నాలుగున్నర అడుగులు అంటే 9. రామానుజుల వారు ఎదురుగా వున్న లీలా నీరాజన మంటపం పొంటేన్ 36 అడుగులు 3+6=9.

ఇలా నవవిధ సంబంధంతో క్షేత్రం అలరారుతుంది. చుట్టూ 108 దివ్య క్షేత్రాలు వున్నాయి. వాటిని దివ్య తిరుపతులు అంటాం. అవి కూడా 9 సంఖ్య. అందువల్ల అక్కడకు వచ్చే ప్రతి మనిషికి ఏ వికారాలు లేకుండా ఉజ్జీవించడానికి కావలసిన ఒక గొప్ప సోపానాలు మనకు దర్శనం ఇస్తాయి. ఇక్కడ అడుగు పెట్టి కాసేపు ధ్యానం చేస్తే మన మనసు శు ద్ధమవుతుంది అనడంలో సంశయంలేదు. అలా తొమ్మిదో గుణింతం చూడండి. అంతా చూసినా తొమ్మిది వస్తుంది తప్ప ఏ మార్పు వుండదు. అలా మన మానవీయ విలువలలో ఏ రకమైన మార్పులూ లేకుండా మంచి మానవీయ విలువలు కలుగే స్థితి కలుగించి మహనీయులుగా చేసే గొప్ప క్షేత్రం మన సమతామూర్తి కేంద్రం. ★

# శ్రేష్ఠమైన గోదా కళ్యాణము

కళ్యాణ గుణధాముడైన భగవంతునితో కరుణామూర్తి అయిన అమ్మను చేర్చి, ఇరువురిని చేరికగా ఆరాధించినప్పుడే ఆ పూజ ఫలవంతం అవుతుంది. లోకానికి క్షేమాన్ని కలిగిస్తుంది. అందుకే దివ్య క్షేత్రాల్లో నిత్య కళ్యాణ ఆరాధనలు జరిపిస్తారు. ఈ వ్రతం గృహాలలోను దేవాలయాల్లోనూ ఆచరించబడుతున్నది. మంత్ర రత్నాధి దేవతాయై నమః అని కీర్తించబడు శ్రీ గోదాదేవి శ్రీరంగనాయకుల కల్యాణం శ్రేష్ఠ మైనది.

**"ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ**
**ప్రతీచ్ఛ చైనా భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా"**

అని స్వయంవరం లో గెలిచిన శ్రీరామచంద్రునికి జనకమహారాజు యోగ్యుడైన వరుడు కనుక సంతోషంతో కన్యాదానం చేసి వివాహం జరిపిస్తాడు. అలాగే ప్రతి ఒక్క వరుణ్ణీ లక్ష్మీనారాయణ స్వరూపంగా వయసులో చిన్నవారైన కాళ్లు కడిగి కన్యాదానం చేస్తారు. విశేషించి సాక్షాత్తు శ్రియఃపతియే తానై వరించి మానవ కన్యకు వరుడైన వైనం! ఎంతో అద్భుతం ఆరాధనీయం.

భూదేవిని వరాహరూపంలో ప్రీతితో పైకెత్తి రక్షించిన తర్వాత స్వామికి ఇంకా ఆ సంతృప్తి తీర లేదట! శ్రీ విల్లిపుత్తూరు సమీపంలోని సంచరించారట! కలియుగంలో వరాహ రూపుడైన శ్రీమన్నారాయణుని పై భూమాదేవి ప్రేమాతృత తీరక, భూమాదేవి కలియుగంలో తానై పరమ భక్తాగ్రేసరుడు అయిన శ్రీవిష్ణుచిత్తుల వారికి తులసి వనంలో లభించి, పుత్రికగా పెరిగింది. సదా శ్రీహరికథా శ్రవణం, గుణకీర్తనం, ఆరాధనం. వీటితో పాటు తండ్రి గారి వద్ద సకల శాస్త్ర పారంగతురాలు అయింది గోదాదేవి. సుగంధ పుష్పమాలలతో అక్కడి అర్చామూర్తిని సేవించే పెరియాళ్వార్లకు తన కూతురు చేసే స్వోఛ్చిష్ట మాల సమర్పణం గురించి తెలిసింది. కలత చెందిన విష్ణుచిత్తులవారికి ఆ సుగంధ మాలలే పరంధామునికి ప్రీతికరమని తెలిసి సంభ్రమాశ్చర్యాలతో భక్తి పరవశుడైనాడు. వివాహ వయస్సు సమీపించిన కుమార్తె కోసం తుల్య రూప శీల వయో వృత్తులు గల వరుని కోసం అన్వేషించాడు. కానీ అర్చామూర్తి అయిన శ్రీరంగనాథుని వివాహమాడడానికి ఇచ్ఛగించిన కుమార్తెను చూసి నిరుత్తరుడయినాడు. నాచ్చియార్ తిరువాయ్ మొళి, తిరుప్పావై వంటి దివ్యప్రబంధ గీతాలాపన చేసే గోదాదేవిని అర్చామూర్తికి ఏ విధంగా అర్పించాలో తోచలేదు

**" రంగేశ లగ్న హృదయా హ్యతప్యత దివా నిషం**
**జిత నిద్రా జితాహార రాధికేవ సమాస్థితా"**

నిద్రాహారాలు మాని శ్రీరంగనాథుని యందు మనస్సు కలిగినదై రాత్రిం బవళ్లు తపిస్తున్నది గోదాదేవి. మరియు తండ్రి గారితో

**"భగవంతం వినానాన్యం వృణే మేభీష్టదం పతిం**
**మా శోకం కురు ధర్మజ్ఞ మదర్థం రక్షకో హరిః"**

అని అన్నది. అంటే నా వివాహానికి మీరు ఆరాట పడకండి. నేను భగవంతుణ్ణి కాక ఇంకొకరిని పెళ్లాడను.నాకు హరే రక్షకుడు. అని తండ్రిని ఓదార్చింది.

ఒకరోజు గోదాదేవి కలగన్నది.ఆ కలను తన సఖుల తోనూ, తండ్రి తోనూ చెప్పింది. అదే దివ్యమైన" వారణమాయిరం." వేయి ఏనుగుల అంబారీ వైభవంతో సకలదేవతా పరివృతుడైన శ్రీరంగనాథుడు సాంప్రదాయ రీతిలో తనను వివాహమాడిన సన్నివేశం! నేటికీ భగవత్ కళ్యాణోత్సవ సమయంలో దేవాలయాల్లో పఠించ బడుతుంది. పరవశించిన గోదాదేవి...

**" శ్రీ రంగేశ కమలాసింధో ! మత్పాణిగ్రహణం కురు**
**త్వాం వినా2హం నజానామి సత్యం వాచ్చి నమోస్తుతే"** ఓ శ్రీరంగేశ! నీవు తప్ప నాకు భర్తగా ఇంకొకరు తెలియదు. నీవే నన్ను పెళ్లాడు! అని ప్రార్థించింది. గోదాదేవి కల సంకల్ప రూపమై సిద్ధించింది. ఆమె ప్రార్ధన ఫలించింది. శ్రీరంగనాథుడు విష్ణుచిత్తులవారికి ఆహ్వానం పంపాడు. దివ్యాభరణ కానుకలు,పల్లకీలు అర్చకుల ద్వారా పంపించాడు. పరమ భక్తి పరవశుడైన పెరియాళ్వారు తనసుద్ధరించ వచ్చిన కూతురును "ఆండాళే" అని సంబోధించాడు. సాక్షాత్ శ్రీరంగనాథునికి కన్యాదానం చేసి, ఆండాళ్ తల్లి చేయి శ్రీరంగనాథుని చేతిలో ఉంచి పాణిగ్రహణం గావించాడు.

**" పరితుష్టోస్మి భద్రం తే స్తోత్రేణానేన బాలికే!**
**త్వత్ పాణిగ్రహణం శీఘ్రం కరిష్యామి న సంశయః"** అని శ్రీరంగనాథుడు గోదాదేవిని స్వీకరించాడు. ఆ విధంగా నోము నోచి గోప స్త్రీ వలే శ్రీకృష్ణ సంశ్లేషం పొందింది. ధరించిన సుగంధ మాలలు సమర్పించి సూడి కొడుత్త నాచ్చియార్ అయింది. ప్రీతితో గోదాదేవిని స్వీకరించి శ్రీరంగనాథుడు "రమ్య జామాతృ" అని వర వరుడు అని, అందమైన శ్రేష్ఠమైన అల్లుడు గా కీర్తింప బడ్డాడు."స్వోఛ్చిష్టాయాం స్రజి నిగళితం యబలాత్కృత్య భుంక్తే" ఇష్టంతో తానై భగవంతుని వరించి పొందిన దని గోదాదేవి కీర్తించబడింది.

అందుకే గోదా కళ్యాణము శ్రేష్ఠమైనది. మంత్ర రత్నం అయిన ద్వయ మంత్రార్థ సారాన్ని ప్రతిఫలించే కళ్యాణ రత్నం. "జాతౌ జాతౌ యదుత్కృష్టం తద్రత్నమితి కథ్యతే" అని గోదా కళ్యాణము గొప్ప ఫలదాయకమైనది. శ్రేష్ఠమైనది. ఈ విశేష వృత్తాంతం విన్నా, ఆచరించినా వారణమాయిరం, తిరుప్పావై అనుసంధానించినా వివాహ యోగం కోరిన వారికి తప్పక సిద్ధిస్తుందని మన పెద్దలు ఫలశ్రుతి కూడా చెప్పారు.

# ఋత్విక్ సమీకరణ -హోమశిక్షణ



కరీంనగర్ వేదభవనంలో హోమశిక్షణ

ఋత్విక్ సమీకరణ అన్ని ప్రాంతాలలో జరుగుతోంది కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్, విశాఖ, విజయవాడ ప్రాంతాలలో హోమశిక్షణలు జరిగాయి. యాజ్ఞికపీఠంలో గత మూడు సంవత్సరాలుగా హోమశిక్షణనిస్తున్న సందర్భాలు ఉన్నాయి. శ్వాస్ నేతృత్వంలో హోమశిక్షణ నిర్వహిస్తున్నారు



ఇసిఐఎల్ రంగనాధస్వామి దేవాలయంలో



హైదరాబాద్‌లో హోమశిక్షణలో పాల్గొన్న వారికి అహోబిల స్వామి మంగళా శాసనాలు



యాజ్ఞికపీఠంలో ప్రత్యక్ష హోమశిక్షణ



యాజ్ఞికపీఠం నేతృత్వంలో పెంబర్తిలో హోమశిక్షణ



జీయ్యర్ స్వామి ఆశ్రమంకు కరీంనగర్ వేదభవనం నుంచి విచ్చేసిన శ్రీవైష్ణవ స్వాములు



# అదిగో అల్లదిగో సమతా మూర్తి









ముచ్చింతలకు ముఖ్యమంత్రి యంత్రాంగంతో తరలి వెళ్లారు. శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారి మంగళా శాసనాలు స్వీకరించిన తరువాత అక్కడ జరుగుతున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. యాగశాలల నిర్మాణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు అధికారులు కూడా తరలి వెళ్లారు. మీడియా ప్రతినిధులు కూడా అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. చారిత్రాత్మక ఘట్టం అద్భుత ఆవిష్కరణకు ఏర్పాట్లు అద్భుతం







# భయం లేని జీవితం గడిపే మార్గం

ఉషోదయం చీకట్లను చిమ్మి వేసినట్లు భగవత్ విశ్వాసం అంతర్గతమైన ఆర్తిని తొలగిస్తుంది భగవత్ సంబంధ భావన, భగవత్ సాన్నిధ్యానుభూతి భగవత్ శరణాగతికి మనను అంకితం చేస్తుంది. అటువంటి జ్ఞాన ప్రకాశం సజ్జన గోష్ఠి సదాచార అనుసరణ వల్లనే లభిస్తుంది. అటువంటి జీవన మార్గం సత్సాంప్రదాయాల అవగాహనకు మనను పురిగొల్పుతుంది. అది మనలను సదా చార్యుల సాన్నిధ్యానికి చేరుస్తుంది ఆ ఆచార్య సేవానిరతి మనకు సకల ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది. మన సదాచార ఆచరణ ఫలమే మనకు ఒక సఫలమైన జీవన గతిని సూచిస్తుంది. ఆ మార్గంలో భయానికి తావుండదు. నిర్భయంగా ఆత్మవిశ్వాసంతో సర్వ సంపన్నతతో మనకు నిర్దేశింపబడిన జీవనాన్ని సాగించవచ్చు. సదాచార తృష్ణ కలగాలంటే సాత్వికాహారం స్వీకరించడం కూడా ప్రధానమే! ఆహార శుద్ధి సత్వ శుద్ధిః అని ఆహారము కూడా మన భావోద్వేగాలను ప్రభావిత పరుస్తుంది అయితే ధర్మ భీతి,పాపభీతి, న్యాయభీతి, శాస్త్రభీతి అనేవి ఉండతగినవే అని పెద్దలు చెబుతారు. మనకు కలిగే భయం మూడు కాలాలకి సంబంధించింది. గతాన్ని తలచుకుని కలిగే భయం జరుగుతున్న కాలంలో ఎలా ఉండాలో అని భయం రాబోయే కాలంలో ఏం జరగబోతుందో అని భయం. విపత్తును ఊహించడం వల్ల కలిగే భయం విపత్తును ఎదుర్కొనేటప్పుడు కలిగే కష్టం కంటే పెద్దదని అనుభవజ్ఞుల మాట. ఇలాంటి అన్ని రకాల భయాలు మనకు తొలగాలంటే సదాచార్యులను ఆశ్రయించడం ఒకటే మార్గం. తద్వారా భగవత్స్వరూప జ్ఞానం కలిగుతుంది తద్వారా భగవద్ విశ్వాసాన్ని బలపరిచే వెలుగు చూపే కరదీపంలా మనకు ఆచార్య బోధనలు తోడై ఉంటాయి. అటువంటి పరిష్కార జ్ఞాన సంపద మనకు అందించేవి వేద పురాణ శాస్త్రాలు, మన సంప్రదాయాలు కూడా.

ప్రధానంగా నేటి కాలంలో ఆ వైదిక భావ పరంపరను వెన్న కన్న సున్నితంగా అమృతం కంటే మధురంగా,ఆచరణ యోగ్యంగా మనకు బోధించగలిగే సదాచార్యులు శ్రీ నివాస స్వరూపులైన శ్రీ శ్రీ శ్రీ మన చిన్న జీయర్ స్వామి వారే... వారి సమకాలీనత మన మహద్భాగ్యం అది సద్వినియోగం చేసుకోవడం ఒక మహాయోగం!

అసలు సమయాన్ని ఎలా సద్వినియోగం చేయాలో తెలియక పోవటమే మన భయాలకు కారణం. సదాచార్య సాన్నిధ్యం ఆ జ్ఞానాన్ని మనకు తెలియ పరుస్తుంది. ఆచార్య సాన్నిహిత్యం అంటే ఆచార్యులకు భౌతికంగా చేరువలో ఉండటం కాదు. ఆచార్య సన్నిధానాన్ని అంటే ఆచార్య శ్రీ సూక్తి భావ పరంపర ఆచరణనుస్థిరమైన దృఢమైన విశ్వాసం నిండిన మనసుతో పట్టాలి, అనుసరణ లో పెట్టాలి. అనేది పెద్దల ఉపదేశం.

భయం అంటే అభద్రతా భావం. స్తనంధయ శిశువు లాగా (పాలు తాగే శిశువులాగా) అనన్య శరణ భావనతో భగవత్ సంబంధ భావన కలిగి ఉండటం,నిర్భీతి గల జీవన మార్గం అనుసరించడమే అభయం! 'వైరాగ్యమేవ అభయం' అని సాంసారిక విరాగత్వమే అభయము అని కూడా నిర్వచిస్తారు.' నవిద్యతే భయం అనేన ఇతి వైరాగ్యం' అని "భయం న భవతి ఇతి వైరాగ్యం" అనికూడా అర్థాలను వివరిస్తారు. భగవద్గీతలో

**"బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా"** అని

చెప్పబడింది. అనగా ఎవరయితే భగవత్ అర్పితంగా కర్మలను. చేస్తారో !... అతడు నీటితో తామరాకు లాగానే పాపాలతో తాకబడడు. అని భావం. ఇటువంటి భావననే వైరాగ్యం అని పెద్దలు చెబుతారు. అటువంటివి భావన జ్ఞానము వల్లనే కలుగుతుంది. పద్మము పంకజమై బురదలో తూడూకొని వుండి ,సూర్యుని చేత వికసింప చేయబడుతుంది. పంకము పద్మానికి జన్మ కారణమైతే అందులోని నీరు జ్ఞానంగా భావిస్తే భగవంతుడనే సూర్యుని చేత వికసింప చేయబడుతుంది పద్మము. కానీ అదే పద్మము ఆ భగవత్ సంబంధిత జ్ఞానము అనే నీరు లేక పోతే సూర్యుని చేతనే శుష్కింప చేయబడుతుంది" కమలం జలాదపేతం శోషయతి రవిః న తోషయతి" అని చెప్పబడింది అందుకే భగవద్ విశ్వాసం, భగవత్ సంబంధ జ్ఞానం చేతనున్ని తరింపజేస్తుంది. అభయ పూర్ణమైన జీవితాన్ని అనుభవింప చేస్తుంది. అటువంటి అభయం భగవద్ విశ్వాసం వల్ల మాత్రమే లభించదు భగవత్ శరణాగతి వల్ల భగవదనుగ్రహం వల్ల లభిస్తుంది అని పెద్దలమాట ! పరమాత్మ యందు మనకుండే విశ్వాసమే ఆత్మవిశ్వాసం. అది కలిగిన వారు కృంగిపోకుండా ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కొగలుగుతారు. ఆలోచనాశక్తి ఉత్తేజితమై పరిష్కార మార్గాలు ప్రకాశిస్తాయి. లౌకికమైన దోషాలు తొలగుతాయి.


**(తరవాతి సంచికలో మరికొన్ని పెద్దల సూక్తులను తెలుసుకుందాం)**

# ఆకాశం నుండి అమృత బిందువులు కురుస్తాయి

## బాలవిజ్ఞానం

"ఆకాశంలోంచి అమృత బిందువులు కురుస్తాయి'' వాటి క్రింద నిలబడి తడిస్తే మనకు చదువు, ఆరోగ్యం, అందరి ప్రేమ,అన్నీ లభిస్తాయి.' ఈ మాటలే విశాల్ వాత్సవ్ కు పదేపదే మనసులోంచి మస్తిష్కం దాకా ప్రతిధ్వనిస్తున్నాయి.

విశాల్ శ్రీ వాత్సవ్ పదేళ్ళ వయసుగల పిల్లవాడు. పేరుకు తగినట్లు విశాలమైన కళ్ళు చిరునవ్వుతో వెలిగే ముఖం కలిగిన వాడు. కుటుంబం లో వారందరికీ అతనంటే చాలా ఇష్టం కానీ అమ్మ తో సహా ఎవరూ ఆత్మీయంగా మాట్లాడరు. అతను ఊహించిన విధంగా, కోరిన విధంగా ఎవరు ప్రవర్తించరు. కారణం విశాల్ కు కూడా తెలుసు. చదువులో వెనకబడటం, ఎప్పుడూ అనారోగ్యంకు గురికావటం, ఎవరైనా ఏదైనా చెబితే మరచిపోవటం. ఇవన్నీ లోపాలు ఉన్నాయి. ఇది విశాల్ కు చిన్న విషయాలే కానీ అందరికీ అవే భయంకరమైన లోపాలుగా కనిపిస్తాయి. తప్పంతా విశాల్ దేనని అందరూ నిందిస్తారు.



కండ్లు మూసుకున్నా నిద్ర రావడం లేదు విశాల్ కు. "సరిగ్గా తినడు, చదవడు, సమయానికి నిద్రపోడు,'' ఇలాంటి సహస్రనామావళి నిత్యం వినపడేవే! ఇప్పుడూ వినిపిస్తున్నాయి. రుసరుసలు, భృకుటి ముళ్ళు, తర్జనీముద్రలు ఎప్పుడూ కనపడేవే. అవి ఎవరు, ఏమిటి అని లేదు. ఎవరైనా కావచ్చు. అమ్మతో కూడా కలిపి అందరూ అనేవే! ఈ బెంగ కలిగినప్పుడల్లా విశాల్ కోరుకునే చల్లని అమృత బిందువులు కురువవు కానీ, చెంపల పైన కన్నీటి బిందువులు మాత్రం కురుస్తాయి. అవి కూడా బాధ కన్నా కోపం ఎక్కువ వస్తుంది. కనుక వెచ్చగానే కురుస్తాయి. బడిలో వెనుకబడిన పిల్లలకు ప్రేరణాత్మక ప్రసంగాలు ఇప్పిస్తారు. ఆ కార్యక్రమంలో విన్న మాటలు విశాల్ హృదయం లో చక్కగా నాటుకున్నాయి. ఉద్వేగభరితమైన ఆలోచనల తడిలో అవి చక్కగా వేర్లూనుకున్నాయి ."ఆకాశం నుండి అమృత బిందువులు కురుస్తాయి'' ఉదయాన్నే మేల్కొని ఆ అమృత బిందువుల్లో తడవాలి.త్వరగా మేల్కొనాలి. అని ఒకటే తపన విశాల్ కు. కానీ రాత్రి సమయం దాటి నిద్రిస్తే ఉదయం ఎట్లా మెలకువ వస్తుంది?. అనుకొని గ్లాస్ నిండా నీళ్ల త్రాగి గుండె బరువు తీర్చుకొని చక్కగా హాయిగా పడుకుని నిద్ర పోయాడు విశాల్ .

హృదయం లోతుల్లోంచి చేసుకున్న సంకల్పం,నిర్ణయం కనుక ఉదయాత్పూర్వమే చీకటి సంధ్యలోనే మేల్కొన్నాడు. లేచి వాకిట్లోకి ఆకాశం క్రింది వరకు నాలుగడుగులు వేయగానే కాళ్ళ కింద చల్లగా పచ్చిక, ప్రక్కల చిన్న చిన్న మొక్కలు, దూరంగా చల్లగా గాలిని పంపే పెద్ద చెట్లు మెల్లగా వినపడే శబ్దాలు అన్ని పలకరించాయి. అలవాటు లేక మేల్కొన్న నిద్రమత్తులో హాయిగా ఆహ్లాదంగా అనిపించింది.

ట్రైనర్ చెప్పిన విధంగా సుఖాసనం గా నేలపై కూర్చుని రెండు అరచేతులతో మొఖం మొత్తాన్ని సున్నితంగా తుడుచుకున్నాడు .దీర్ఘంగా ఊపిరి పీల్చి వదిలాడు చల్లని గాలి వంటికి తాకింది తెలిసి తెలియనట్లుగా తేమ లాగా తడి లాగా స్పర్శ తాకగానే విశాల్ వెన్నుపూస నుండి ఒక చల్లని పులకరింత వచ్చింది. హృదయం ఉల్లాసంగా నిద్రమత్తు అంతా పోయి ఉత్తేజితం అయ్యింది. " ఆకాశం నుండి అమృత బిందువులు కురిసాయి'' అని ఆనంద పడిపోయాడు. మసక చీకటిలో ఆకాశం వైపు చూస్తే... ఎప్పటిలాగా భయం వేయలేదు. సన్నని ఎరుపు రేఖలతో ఉషః కాంతులు అతన్ని పలకరించాయి.

వారం రోజుల తర్వాత.... అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండే విశాల్ త్వరగా పడుకున్నాడు. బయటనుండి అమ్మ మాట్లాడే మాటలు వినిపిస్తున్నాయి. అవి నిజమైన స్తోత్రాలే! ఎందుకంటే విశాల్ను పొగుడుతున్నారు'' విశాల్ చాలా మారిపోయాడు. ఎంతగానో తెలివి పెరిగింది. ఆరోగ్యంగా ఉన్నాడు. బాగా చదువుతున్నాడు .సరిగ్గా సమయాన్ని పాటిస్తున్నాడు. ప్రేరణ శిక్షణ ఇచ్చిన ఆయన ఎంతో గొప్పవాడు.''ఇలా సాగుతున్నాయి అమ్మ మాటలు.కానీ విశాల్ పెదవులపై ఆత్మవిశ్వాసంతో కూడిన చిరునవ్వు ఉంది. కళ్ళల్లో ఆనందం తో కూడిన తడి ఉంది. అదే "అమృత బిందువుల'' తడి. అసలు ఆ ట్రేనర్ నన్నేమి మార్చాడు? అసలు నేను ఏమి మారాను? అమ్మకు తెలియదు. ఉదయం పూట బ్రాహ్మీ ముహూర్తంలో "ఆకాశం నుండి అమృత బిందువులు కురుస్తాయి'' అవి తనపై కురిసాయి. అందువల్లే మారాడు.ఆ విషయం అమ్మకు తెలియదు. అసలు చాలామందికి ఈ విషయం తెలియదు. అనుకుంటూ నిద్రకు ఉపక్రమించాడు విశాల్ శ్రీ వాత్సవ్. ★